# నగరాభివృద్ధే ధ్యేయం: డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: నగరాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే ధ్యేయంగా కృషి చేస్తున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఇండోర్ స్టేడియంలో 28 లక్షల రూపాయలతో నిర్మించ తలపెట్టిన వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఆయన రాకను పురస్కరించుకొని క్రీడాకారులు, జిల్లా ప్రాధికార సంస్థ అధికారులు, సిటీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఇండోర్ స్టేడియం వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. గతంలో చేపట్టిన పరిశీలనలో ఇండోర్ స్టేడియంలో మరమ్మతు పనుల విషయమై క్రీడాకారులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. వెంటనే స్పందించి మరమ్మతు పనులకు అంచనాలను వేయమని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించామన్నారు. దీంతో గాల్వనైజెడ్ రూఫ్, సీలింగ్, పెయింటింగ్, సీసీ డ్రైను వంటి ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే ఎజెండాగా తమ పాలన సాగిస్తున్నామన్నారు. ఆయా సందర్భాలలో చెరువులు, క్రీడా ప్రాంగణాలు, పార్కులు వంటివి పునర్నిర్మిస్తూ నగరాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఇప్పటికే ప్రధాన జంక్షన్‌ను అభివృద్ధి చేసామని, 18 లక్షలతో కోడి రామ్మూర్తి వ్యాయామశాల, రాజీవ్ స్టేడియం వంటి క్రీడా ప్రాంగణాలు కూడా అభివృద్ధి చేసి ప్రజా వినియోగంలోకి తెచ్చామన్నారు. ప్రకాశం పార్క్‌ను అభివృద్ధి చేసి త్వరలో ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మేయరు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతి దేవి, కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు, వైసీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, స్థానిక కార్పొరేటర్ ఆసపు సుజాత, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండల డైరెక్టర్ బంగారు నాయుడు, సిటీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డా.వివిఎస్.ప్రసాద్, సురేష్, ఎం.కె.బి.శ్రీను, తోనంగి జగన్నాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ద్రోహం చేస్తున్న మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించండి

విశాలాంధ్ర - శృంగవరపుకోట: మన రాష్ట్రంతో పాటు దేశంలోని అన్ని రాష్ట్రాలకు ప్రధాని మోడీ సారధ్యంలోని కేంద్ర ప్రభుత్వం ద్రోహం చేస్తోందని, మోడీ ప్రభుత్వాన్ని ఎప్పుడు ఎన్నికలు వచ్చినా గద్దె దించాలని ప్రజలకు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మద్ది కృష్ణ పిలుపునిచ్చారు. బీజేపీని సాగనంపుదాం - దేశాన్ని కాపాడుకుందాం అంటూ సీపీఐ-సీపీఎం నిర్వహిస్తున్న ప్రచారభేరీ కార్యక్రమాన్ని ఎస్.కోట శ్రీనివాసాకాలనీలో మంగళవారం కొనసాగించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు ఇంటింటికీ వెళ్లి మోడీ ప్రభుత్వం చేస్తున్న ద్రోహాలను వివరించే కరపత్రాలను ప్రజలకు అందజేశారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మద్ది కృష్ణ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రత్యేక హోదా, పోలవరం నిధులు, రాజధాని నిర్మాణం, రైల్వే జోన్, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజి వంటి హామీలను అమలు చేయలేదన్నారు. ఇక రాష్ట్రానికి తలమానికంగా ఉన్న విశాఖ స్టీలుప్లాంటును ప్రయివేటీకరణ దిశగా కేంద్రం తీసుకుపోతోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు వాడవల్లి గోపి, పల్లా ఎల్లారావు, బుత్తల అప్పలనాయుడు, కోన అప్పారావు, మణి, నరసింగరావు, పీతల సత్తిబాబు, గనివాడ అచ్చిం నాయుడు, యర్ర రమేష్, బొద్దు అప్పలనాయుడు, రమణ పాల్గొన్నారు.

బొబ్బిలి: దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, మతోన్మాద బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం భారత రాజ్యాంగంపై దాడి చేసి దళిత మైనారిటీలపై మరణకాండ చర్యలకు పాల్పడుతుందని సీపీఐ, సీపీఎం నాయకులు కోట అప్పన్న, ఎస్.గోపాలం, మునకాల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ప్రచార భేరీలో భాగంగా వారు మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడడం కోసం ప్రతీ పౌరుడు గొంతెత్తి కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను నిలదీయాలని, ప్రజా వ్యతిరేక నిరంకుశ మతోన్మాద బీజేపీని సాగనంపాలని కోరుతూ బొబ్బిలి పట్టణంలో ఉన్న తాండ్రపాపారాయ జంక్షన్ జండా మహల్ సెంటర్‌లలో జోరుగా ప్రచారం నిర్వహించారు. మోడీ -అమిత్ షాల నాయకత్వంలో బిజెపి - ఆర్ఎస్ఎస్ కూటమి అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉండవలసిన ప్రజల మధ్య మత విద్వేషపు చిచ్చు రాజేస్తుందన్నారు. మరోవైపు ఆదానీ - అంబానీ లాంటి అతి సంపన్నులకు దేశ సంపదను దోచిపెడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కె.వెంకట సత్యనారాయణ, దాడి సింహాచలం, సీఐటీయూ నాయకులు అలమండ సురేష్ పాల్గొన్నారు.

# శివారు భూములకు సాగునీరు చేరాలి

## జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విశాలాంధ్ర - విజయనగరం: శివారు భూములకు కూడా సాగునీరు అందేవిధంగా, సాగునీటి కాలువ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆదేశించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద చేపట్టిన సాగునీటి కాలువల అభివృద్ధి పనులపై, ఛైర్‌పర్సన్ తన ఛాంబర్‌లో మంగళవారం సమీక్షించారు. ప్రతీ ఎకరాకు సాగునీరు అందించేందుకు కృషి చేయాలని జెడ్‌పి ఛైర్మన్ కోరారు. తోటపల్లి, గడిగెడ్డ, ఆంధ్ర, తాటిపూడి, తారకరామ తీర్థసాగర్ కాలువ పనుల ప్రగతిని తెలుసుకున్నారు. సాగునీటి కాలువలు ఉన్నచోట, ఈ కాలువ పనులకు మొదట ప్రాధాన్యత ఇవ్వాలని, కాలువలు లేనిచోట మేజర్, మైనర్ చెరువు పనులను, ఫీడర్ కెనాల్ పనులను చేపట్టాలని సూచించారు. కాలువలు, చెరువుల్లో జంగిల్ క్లియరెన్స్, పూడిక తీత పనులను చేపట్టాలన్నారు. పనులు నిర్వహించేందుకు ఇదే తగిన సమయమని, ఈ మూడు నెలల్లోనే అత్యంత వేగంగా పనులు నిర్వహించి పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జెడ్‌పి డిప్యూటీ సిఈఓ కె.రాజ్‌కుమార్, డిపిఓ శ్రీదర్‌రాజా, ఇరిగేషన్ ఇఇ రామచంద్రరావు, డిఎల్‌డిఓ లక్ష్మణరావు, ఉపాధిహామీ ఎపిడిలు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

విశాలాంధ్ర - రామభద్రపురం: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని మండల విద్యాశాఖ అధికారి తిరుమల ప్రసాదు అన్నారు. మంగళవారం తారపురం ఎలిమెంటరీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడారంగము, సాంస్కృతిక కార్యక్రమాలు చాలా అవసరమని అన్నారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు చాలా ప్రతిభ కనబరిచినందుకు ఆనందంగా వుందని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ వి.గణపతిరావు, హెచ్ఎం కుమారి, ఉపాధ్యాయులు తిరుపతిరావు, లలిత, మురళి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సీతంలో "బిజినెస్ మోడల్ కాన్వాస్" కార్యశాల

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: స్థానిక సీతం ఇంజనీరింగ్ కళాశాలలో వ్యాపార నమూనా కాన్వాస్ కార్యశాల నిర్వహించారు. ఈ కార్యశాలకు రిసోర్స్ పర్సన్‌గా విచ్చేసిన కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం, టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్మెంట్ విభాగం డీన్ ప్రొఫెసర్ జితేంద్ర మోహన్ మిశ్రా మాట్లాడుతూ సమాజంలోని అవసరాలను అర్థం చేసుకొని దానికి అనుగుణంగా వ్యాపార నమూనాను తయారు చేసుకొని, వ్యాపారాన్ని ప్రారంభించాలన్నారు. విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశి భూషణ్ రావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి.రామమూర్తి, డిపార్ట్మెంట్ ఆఫ్ మేనేజ్మెంట్ స్టడీస్ హెచ్.ఓ.డి. డాక్టర్ ఎస్.వరూధిని, డిపార్ట్మెంట్ ఆఫ్ మేనేజ్మెంట్ స్టడీస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వీధి లైట్లు వెలగక ప్రజల ఇక్కట్లు

విశాలాంధ్ర - తెర్లాం: మండలంలో అరసబలగ గ్రామ పంచాయతీలో వీధి లైట్లు వెలగడం లేదని, జేఎల్ఎం విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని సర్పంచ్ సాయిరాం అన్నారు. ఎన్నిసార్లు చెప్పినా వీధి దీపాలు వేయడం లేదని, వీధి దీపాలు వెయ్యడానికి నిచ్చెనలు కూడా కొన్నానని, అసలు సర్పంచ్ మాట వినడం లేదని, విద్యుత్‌కు సంభందించి ఏ పనులు చెయ్యడం లేదని అన్నారు. ఈయన మీద జనరల్ బాడీ సమావేశంలో కంప్లయింట్ కూడా ఇచ్చానని అయినా విధి నిర్వహణలో మార్పు లేదని, గ్రామంలో రాత్రి వేళల్లో వీధి దీపాలు లేకపోవడంతో ప్రజలు చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారని అన్నారు.

## సర్వే రాళ్లు ఏర్పాటు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - గంట్యాడ: గంట్యాడ మండలం కొర్లాం గ్రామంలో భూములు రీ సర్వే పూర్తయిన నేపథ్యంలో సర్వే రాళ్లు పాతే కార్యక్రమంలో భాగంగా మంగళవారం కేఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డాక్టర్ ఆర్‌వి సూర్యనారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకంలో భాగంగా కొర్లాం గ్రామ పొలాలలో పాతిన సర్వే రాళ్లను పరిశీలించారు. సర్వే రాళుపాతే కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలని సర్వే అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు జైహింద్ కుమార్, తహశీల్దార్ ప్రసన్న రాఘవ, డిప్యూటీ తహశీల్దార్ స్వర్ణ కుమార్, సర్వేయర్ అప్పలస్వామి, ఆర్ఐ హరిప్రియ రాజులు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీతోనే సంక్షేమ రాజ్యం: ఎమ్మెల్యే బడ్డుకొండ

విశాలాంధ్ర - డెంకాడ: వైసీపీ ప్రభుత్వంతో సంక్షేమ రాజ్యం అమలు అవుతుందని నెల్లిమర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మంగళవారం తన సొంత గ్రామం మోపాడలో జగనన్నే మా భవిష్యత్తు-మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాలుగేళ్ల కాలంలో ఇచ్చిన హామీలను నెరవేర్చిన సీఎం జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజల నమ్మకాన్ని చూరగొన్నారని తెలిపారు. గ్రామ సచివాలయాల ద్వారా అనేక సేవలు అందించిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డిడి స్వరూపారాణి, వ్యవసాయ అధికారి పి.నిర్మల, ఏపీఎం విజయలక్ష్మి, పిఓపిఆర్డి అప్పలనాయుడు, సంబంధిత శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మి నాయుడు, గ్రామ సర్పంచ్ బడ్డుకొండ కవిత, బడ్డుకొండ రమేష్ బంటుపల్లి మోహన్ పాల్గొన్నారు.

# నేటి నుండి పదవ తరగతి స్పాట్ వాల్యూయేషన్: డీఈఓ

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: పదవ తరగతి స్పాట్ వాల్యూయేషన్‌ను బుధవారం నుండి కోటలో నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి లింగేశ్వర్ రెడ్డి తెలిపారు. దీనికి సంబంధించి జిల్లాకు 1,88,851 పేపర్లు వచ్చాయని, వీటిని దిద్దడానికి మొత్తం 1076 మంది ఉపాధ్యాయులను సిద్ధం చేశామన్నారు. దీనిలో చీఫ్ ఎగ్జామినర్స్‌గా 195 మంది, అసిస్టెంట్ ఎగ్జామినేషన్‌గా 585 మంది వీరితోపాటు స్పెషల్ అసిస్టెంట్‌గా 195 మందిని నియమించామన్నారు. బుధవారం నుండి ప్రారంభమైన స్పాట్ వాల్యూయేషన్ ప్రక్రియ ఈనెల 26వ తేదీ వరకు ఉంటుందన్నారు. మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పించడం జరిగిందని తెలిపారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు ఈ ప్రక్రియ జరుగుతుందని అన్నారు. బుధవారం నుండి ప్రారంభమయ్యే స్పాట్‌కు ఉపాధ్యాయులంతా ఎనిమిది గంటలకు హాజరు కావాలన్నారు.

## మాజీ ఉపరాష్ట్రపతికి ఎంపీ బెల్లాన స్వాగతం

విశాలాంధ్ర - చీపురుపల్లి: మాజీ భారత ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడుకి విజయనగరం పార్లమెంట్ సభ్యులు బెల్లాన చంద్రశేఖర్ స్వాగతం పలికారు. వెంకయ్య నాయుడును దుస్సాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ యువజన నాయకులు బెల్లాన వంశీకృష్ణ, చీపురుపల్లి మండల వైసీపీ నాయకులు ఇప్పిలి అనంతం, చీపురుపల్లి సర్పంచ్ మంగళగిరి సుధారాణి, శ్రీనువాసరావు, పార్టీ నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రుల్లో ప్రసవాలు జరగాలి: పీఓ విష్ణు చరణ్

విశాలాంధ్ర - పార్వతీపురం/బెలగాం: ఆసుపత్రుల్లో ప్రసవాలు జరగాలని, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్ అన్నారు. వైద్య ఆరోగ్యశాఖ కార్యక్రమాలపై ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో ప్రాజెక్టు అధికారి మంగళవారం సమీక్షించారు. గర్భిణీల వివరాలు పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రసవ తేదీలను ముందుగానే గుర్తించి గర్భిణీలను వసతి గృహాల్లో చేర్చాలని అచ్చట అన్ని వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మంచి సేవలు అందించాలని ఆదేశించారు. తద్వారా హై రిస్క్ సమస్య తలెత్తే అవకాశాలు ఉండవని అన్నారు. రక్త హీనత పరీక్షలు అందరికీ నిర్వహించి తగిన అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సంపూర్ణ పోషణ కిట్లు విధిగా అందాలని వాటిపై స్పష్టమైన పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. తల్లి పిల్లల ఆధార్ రిజిస్ట్రేషన్, ఇతర వివరాలను సంబంధిత పోర్టల్‌లో విధిగా నమోదు చేయాలని ఆదేశించారు. ఇమ్యునైజేషన్ ప్రతి ఒక్కరికీ జరగాలని స్పష్టం చేశారు. ఇమ్యునైజేషన్ చేయడంలో ఎటువంటి అలసత్వం ఉండరాదని పేర్కొన్నారు. సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించి జీవన విధానంలో చిన్న మార్పుల వలన అనేక వ్యాధులకు దూరంగా ఉండవచ్చని తెలియజేయాలని చెప్పారు. మలేరియా, డెంగీ తదితర వ్యాధుల పట్ల అప్రమత్తం చేయాలని సూచించారు. స్ప్రేయింగ్ కార్యక్రమం పక్కాగా జరగాలని ఆదేశించారు. ఫీడర్ అంబులెన్సులు, 104, 108, 102 వాహనాల అందుబాటు, సేవలు సంతృప్తికరంగా ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. బగాది జగన్నాథరావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి. జగన్మోహనరావు, ఆర్.బి.ఎస్.కె ప్రాజెక్టు అధికారి డా. ధవళ భాస్కరరావు, ఇన్‌ఛార్జ్ డెప్యూటీ డిఎంహెచ్ఓ డా. డివి రమణ, ప్రోగ్రాం అధికారి డా. వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నత్తనడకన సాగుతున్న ఆధునీకరణ పనులు

విశాలాంధ్ర - పాలకొండ: ఎన్నో పోరాటాలు ఫలితంగా సాధించుకున్న ఆధునీకరణ పనులు చేపట్టడంలో పాలకవర్గాలకు చిత్తశుద్ధి లేకపోవడమే కారణమని జరుగుతున్న తోటపల్లి కాలుల ఆధునీకరణ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాల్సిన అవసరం ఉందని, ప్రధానంగా జల వనరుల శాఖ అధికారుల పర్యవేక్షణతో పనులు జరపాలని సాధన సమితి ప్రతినిధి బృందం డిమాండ్ చేసింది. పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలం కత్తులు కవిటి గ్రామ వద్ద జరుగుతున్న తోటపల్లి కాలువ పనులను సాధన సమితి అధ్యక్షులు చేబోదుల లక్ష్మీనారాయణ, బుడితి అప్పల నాయుడు ఆధ్వర్యంలో మంగళవరం పరిశీలన చేశారు. ప్రభుత్వం ఆధునీకరణ పనులకు కావలసిన నిధులు విడుదల చేసి జరిగిన పనులకు బిల్లును చెల్లించినట్లయితే గుత్తేదారుపై ఒత్తిడి చేయవచ్చని వారు అభిప్రాయపడ్డారు. ఖరీఫ్ సీజన్ ముందు తూతూ మంత్రంగా పనులు చేపట్టి సకాలంలో పూర్తి కావాల్సిన ఆధునీకరణ పనులు చేయలేకపోవడమే కాకుండా ఖరీఫ్ సీజన్లో సాగునీటి విడుదలపై ప్రభావం చూపడం జరుగుతుందన్నారు. సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడే పరిస్థితి పునరావృతం కాకుండా తగు చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు రేగులపాడు గ్రామ మాజీ సర్పంచ్ గేదెల గజేంద్ర నాయుడు, పామోటి వైకుంఠ రావులు మాట్లాడుతూ పనులలో ఇసుక పాలు పెరుగుతుందని ఇటువంటి చర్యల వల్ల దీర్ఘకాలికంగా ఉండాల్సిన కట్టడాలకు నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ కాలువ పరిశీలన కార్యక్రమంలో రౌతు కృష్ణ నాయుడు, రౌతు తాతబాబు, (కె.కమిటీ) చిరంజీవి, వి.గణేష్ (రేగులపాడు), తులసి (ఎం రాజ పురం) తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సరఫరాలో అంతరాయం

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: పట్టణంలోని 30 వార్డులకు సంబంధించి కుళాయిల ద్వారా త్రాగునీటి సరఫరా విషయంలో కొంతమేర అంతరాయం ఏర్పడిందని మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పల నాయుడు తెలిపారు. మంగళవారం ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ తోటపల్లి రిజర్వాయర్ నుండి పట్టణంలోని ట్యాంకులకు పంపింగ్ చేపడుతున్న పైపు లైన్లకు బూస్టర్ పంప్ హౌస్ వద్ద సాంకేతిక లోపం కారణంగా త్రాగునీటి పంపింగ్ నిలుపుదల చేయడం జరిగిందని ఈ అంతరాయం మరో రెండు రోజులపాటు కొనసాగవచ్చని మరమ్మతులు పూర్తయిన వెంటనే త్రాగునీటి సరఫరా చేయబడునని ఈ విషయాన్ని పట్టణ ప్రజలు గమనించి మున్సిపల్ అధికారులకు సహకరించాలని కోరారు.

## జి.శివడలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్

విశాలాంధ్ర, - కురుపాం: మండలంలోని జి.శివడ గ్రామంలో 104 ఆధ్వర్యంలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి బి.ప్రజ్ఞ 58 మందికి వైద్య సేవలు నిర్వహించి బాలింతలకు, పక్షవాతంతో బాధపడిన వాళ్ళ ఇంటికి వెళ్లి వైద్య సేవలు అందించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి పరిసరాల పరిశుభ్రతపై వివరించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంరక్షణ అధికారి బి. భానుమూర్తి, ఎంఎల్‌హెచ్‌పి మహేశ్వరీ, హెల్త్ సూపర్ వైజర్ నాగేశ్వరావు, హెల్త్ విజిటర్ పి.భారతి, హెల్త్ అసిస్టెంట్ రామారావు, ఏఎన్ఎం సుఖవాసి ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## అగ్నిమాపక ప్రమాదాల పట్ల జాగ్రత్త వహించాలి

### అగ్నిమాపక అధికారి పైడిరాజు

విశాలాంధ్ర - సాలూరు టౌన్: పెట్రోల్ బంకుల యజమానులు అగ్ని ప్రమాదాల పట్ల జాగ్రత్త వహించాలని అగ్నిమాపక అధికారి పి.పైడిరాజు పేర్కొన్నారు. మంగళవారం అగ్నిమాపక వార్షికోత్సవాల్లో భాగంగా పెట్రోల్ బంకుల్లో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు పెట్రోల్ బంకులలో తీవ్ర నష్టం కలిగిస్తాయని ఫైర్ ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే అగ్ని ప్రమాదం ఏర్పడిన సమయంలో ఎలా పరికరాలను ఉపయోగించుకోవాలో అక్కడున్న సిబ్బందికి అవగాహన కల్పించారు. 101 టోల్ ఫ్రీ నెంబర్ అందుబాటులో ఉంచుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

## సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి

విశాలాంధ్ర - కొమరాడ: గ్రామ సచివాలయం సిబ్బంది అందరూ సమయపాలన పాటించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎల్‌వి అప్పారావు అన్నారు. మంగళవారం ఉలిపిరి, చోల్లపదం గ్రామ సచివాలయాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్చార్జ్ ఎంపీడీవో ఎల్‌వి అప్పారావు మాట్లాడుతూ మండలంలో 20 గ్రామ సచివాలయాలు ఉన్నాయని గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరు సమయపాలన పాటిస్తూ ప్రజలకి రాష్ట్ర ప్రభుత్వం నుండి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని అన్నారు. అనంతరం గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులపై ఆరా తీశారు. ఎండలు ఎక్కువ ఉన్నాయి కాబట్టి మంచినీటికి ఇబ్బంది లేకుండా ప్రతి గ్రామంలో చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎం.తిరుపతిరావు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

## మారుమూల గ్రామాలకు నెట్‌వర్క్ సదుపాయం

విశాలాంధ్ర - సీతంపేట: సీతంపేట ఐటీడీఏ పరిధిలో గల అన్ని మారుమూల గిరిజన గ్రామాలకు నెట్‌వర్క్ సదుపాయం కల్పించాలని సదుద్దేశంతో ప్రభుత్వం 45 సెల్ టవర్లను మంజూరు చేసిందని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కల్పనా కుమారి తెలిపారు. బిఎస్ఎన్ఎల్ ప్లానింగ్ డీజీఎం, నెట్‌వర్క్ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. త్వరగా నెట్‌వర్క్ పనులను పూర్తి చేయాలని, టవర్లు నిర్మించే ప్రాంతాల్లో ఎటువంటి సమస్యలున్న తమ దృష్టికి తీసుకురావాలని పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ ప్లానింగ్ డీజీఎం బి.వి.వి.నగేష్, ఏపీవో రోషి రెడ్డి, డీపీఓ సతీష్ కుమార్ పాల్గొన్నారు.

## విశాఖ కలెక్టర్‌ను కలిసిన టిడ్కో ఛైర్మెన్ జమ్మాన

విశాలాంధ్ర - పార్వతీపురం: విశాఖపట్టణం జిల్లా కలెక్టర్ డాక్టరు ఏ.మల్లిఖార్జునరావును రాష్ట్ర టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తదుపరి జిల్లా కలెక్టర్‌తో టిడ్కో హౌసింగ్ ప్రాజెక్ట్ అమలు, త్వరలో చేయబోయే గృహప్రవేశాల ప్రారంభోత్సవం, వివిధ ప్రభుత్వ శాఖలలో అపరిష్కృతంగా వున్న పలు సమస్యలపై జమ్మాన చర్చించారు. ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం ఏప్రియల్, మే, జూన్ నెలలో గృహ ప్రవేశాలు ప్రారంభోత్సవం చేయబోవు ప్రాంతాల గూర్చి, అక్కడి లబ్ధిదారులకు అందజేయు ఇళ్ళ సంఖ్యపై, ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణ పనులు వాటి పురోగతి గూర్చి వివరించారు. కార్యక్రమంలో టిడ్కో సూపరెంటెండెంటు ఇంజినీర్ డి.నరసింహమూర్తి, ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ సుధాకర్, డిఈఈ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# పార్వతీపురం మన్యం

## పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

విశాలాంధ్ర - కురుపాం: స్థానిక పోలీస్ స్టేషన్‌ని ఎస్పీ విక్రాంత్ పాటిల్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిధిలో గల నూతనంగా నిర్మాణం జరుగుతున్న భవనాలను పరిశీలించి త్వరితగతిన పనులు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం స్టేషన్లో గల రికార్డులను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. రహదారి ప్రమాదాలు నివారణకు చర్యలు తీసుకోవాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై సిహెచ్ ప్రసాద్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## భోగితల్లి పండగకు ముమ్మరంగా ఏర్పాట్లు

విశాలాంధ్ర - సీతానగరం: సీతానగరం మండల కేంద్రంలో మే నెలలో జరగనున్న శ్రీశ్రీశ్రీ భోగితల్లి అమ్మవారి పండుగకు అన్ని ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. 12 ఏళ్ల తరువాత చేయనున్న పండుగని అత్యంత వైభవంగా నిర్వహిస్తామని నిర్వాహకులు చెబుతున్నారు. ఇప్పటికే సిరిమానుకు సంబంధించి చెట్టును కొట్టి సిరిమానును తయారు చేస్తున్నారు. మరోవైపు ప్రతీ రోజు ఒక్కోవీధిలో అమ్మవారి పాల జంగిడి, తొమ్మిది ఘటాలను అంగరంగ వైభవంగా మేళతాళాలతో, మందుగుండు సామగ్రితో, యువత నృత్యాలతో అర్ధరాత్రివరకు మహిళలు భక్తిశ్రద్ధలతో ఘటాలను మోస్తున్నారు. మంగళవారం బుడ్డిపేటలోని అమ్మవారు గుడిని, గుడిలో భోగితల్లి అమ్మవారిని, గుడిదగ్గర అలంకరణను కమిటీ సభ్యులు చేశారు. సీతానగరం, పెదబోగిలి, బుడ్డిపేట, అప్పయ్యపేటతోపాటు జోగమ్మపేటలో ఎవరిని కదిపినా పండుగ మాట తప్ప ఇంకో మాట, ఇంకో పనిలేదు. పండుగకు అన్ని ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని, అమ్మవారి పండుగను విజయవంతంగా చేస్తే అందరికీ మంచి జరుగుతుందని భక్తులు, వయోవృద్ధులు, యువత చెబుతున్నారు. నెల రోజుల పాటు ప్రతీరోజూ పండగేనని వారంతా తెలిపారు.

## ఉపాధి హామీ పనులు పరిశీలన

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని జోగమ్మపేట గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీఓ ప్రసాద్, సహాయ ప్రోగ్రాం అధికారి భానులు మంగళవారం పరిశీలించారు. హాజరు పరిశీలించి వేతనదారులతో మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు పనులు రెండు పూటలా చేసి ప్రభుత్వం నిర్దేశించిన కూలీని అందుకోవాలని కోరారు. వేతనదారులు ఎండలకు తగిన జాగ్రత్తలు పాటిస్తూ పనులు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్, మేట్లు పాల్గొన్నారు.

## పాపమ్మవలసలో క్రాస్ ప్రోగ్రాం

విశాలాంధ్ర - సీతానగరం: మండలములోని పాపమ్మవలస గ్రామంలో మంగళవారంనాడు క్రాస్ ప్రోగ్రాం ద్వారా మంచినీటి బోర్లును మరమ్మత్తులు చేసి బాగుచేశారు. ఎంపిడిఓ ఆదేశాలు మేరకు ప్రతీరోజూ ఒక్కో గ్రామంలోని బోర్లును మరమ్మత్తులు చేసి బాగు చేయటం జరుగుతుందని మెకానిక్లు చందనపల్లి సత్యనారాయణ, బంకురు సత్యనారాయణ, కృష్ణలు తెలిపారు. వేసవిలో త్రాగు నీరు సమస్య లేకుండా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎంపిడిఓ ప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ పవన్ కుమార్ తెలిపారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ గౌరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు లేని నగరమే ధ్యేయం: మేయర్ విజయలక్ష్మి

విశాలాంధ్ర - విజయ నగరం టౌన్: ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించి, సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా కృషి చేస్తున్నామని నగర మేయర్ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం దాసన్నపేట ప్రాంతంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా 33.50 లక్షల రూపాయలతో 7వ డివిజన్‌లో కరగాని వీధి, కాపువీధి, ఆల్తివీధి, గొల్లవీధి, యాతవీధి, పీసలవీధి, నాగవంశం వీధి ప్రాంతాలలో రహదారులు, కాలువలు పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ నగరంలో అభివృద్ధి అంటే ఏంటో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి చేసి చూపిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పొంతపల్లి మాలతి, డిప్యూటీ మేయర్ రేవతి దేవి, జోనల్ ఇన్చార్జీలు బొద్దాన అప్పారావు, బోడ సింగి ఈశ్వరరావు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రజలు జగన్ పాలననే కోరుకుంటున్నారు

### ఎమ్మెల్సీ రఘురాజు

విశాలాంధ్ర - శృంగవరపుకోట: రాష్ట్ర ప్రజలు జగన్ పాలననే కోరుకుంటున్నారని గత ప్రభుత్వంలో చంద్రబాబు చేసిన మోసాలు గ్రహించి మాకు జగన్ పాలన మళ్లీ కావాలని ముక్తకంఠంతో చెబుతున్నారని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు స్పష్టం చేశారు. ఎస్.కోట శ్రీనివాసాకాలనీలో మంగళవారం 'జగనన్నే మా భవిష్యత్తు- మా నమ్మకం నువ్వే జగన్' అనే కార్యక్రమానికి ఎమ్మెల్సీ ముఖ్య అతిథిగా హాజరై ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా అందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. మన రాష్ట్ర భవిష్యత్తుపై ప్రజా భిప్రాయాన్ని సేకరించడమే "జగనన్నే మా భవిష్యతు" ప్రచారం లక్ష్యమని, 8296082960 ఫోన్ నెంబరుకు మిస్ట్ కాల్ ఇచ్చి ఈ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం.పి.పి సండి సోమేశ్వరరావు, జెడ్పీటీసీ ఎం.వెంకటలక్ష్మి, వైస్ ఎం.పి.పి ఇందుకూరి సుధారాజు, ఎస్.కోట మేజర్ పంచాయితీ వైస్ సర్పంచ్ మండల పార్టీ అధ్యక్షులు మోపాడ కుమార్, ఎం.పి.టి.సి దారగిరి, వార్డు మెంబర్ సూరిబాబు, మాజీ సర్పంచులు బుజ్జి, ఆలుగుబిల్లి వెంకటరావు, నాయకులు వాకాడ రమణ, మజ్జి గంగరాజు, అర్జున్, గణేష్ పాల్గొన్నారు.

# వేచలపు కళ్ళాల రహదారి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్సీ హామీ

విశాలాంధ్ర - శృంగవరపుకోట: ఎస్.కోట పట్టణ శివారు రైల్వే స్టేషనుకి వెనుక వైపు ఉన్న వేచలపు వారి కళ్ళాలు ప్రజల దీర్ఘకాలిక రహదారి సమస్యను అధికారులతో చర్చించి త్వరలోనే పరిష్కరించనున్నట్లు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు హామీ ఇచ్చారు. ఎస్.కోట ఎంపీపీ సోమేశ్వరరావు, ఉప సర్పంచ్ మోపాడ కుమార్, ఎంపీటీసీలు, వార్డు సభ్యులతో కలిసి మంగళవారం వేచలపు కళ్ళాలను ఎమ్మెల్సీ సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలు ఇళ్ళకు సరైన రహదారి సౌకర్యం కల్పించమని, పారిశుధ్యం మెరుగయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తదుపరి శ్రీఎర్నమ్మ అమ్మవారిని దర్శించుకుని, అచ్చట గ్రామస్థుల సహకారంతో నిర్మితమవుతున్న అలయ నిర్మాణాన్ని ఎమ్మెల్సీ రఘురాజు పరిశీ లించారు. ఈ కార్యక్ర మంలో ఎంపీపీ ఎస్.సో మేశ్వ రరావు, వైస్ సర్పంచ్ మోపాడ కుమార్, స్థానిక ఎం.పి.టి.సి దారగిరి, వార్డు మెంబరు సూరిబాబు, నాయకులు పాలు రాము, సంతోష్, గోవింద, అర్జున్, వాకాడ రమణ, మజ్జి గంగరాజు, స్థానికులు పాల్గొన్నారు.

# 278 గ్రామాల్లో రీ సర్వే పూర్తి

విశాలాంధ్ర - వేపాడ: జిల్లాలో 278 గ్రామాల్లో రెండు లక్షల ఎకరాలలో రీ సర్వే పూర్తి చేయడం జరిగిందని జిల్లా సహాయ సంచాలకులు సర్వే, భూ రికార్డుల కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ టి.త్రివిక్రమరావు తెలిపారు. అలాగే మరో లక్ష ఎకరాలలో సర్వే పనులు జరుగుతున్నాయన్నారు. 179 ఎకరాలలో ఫిజికల్ సర్వే పనులు పూర్తి చేయగా జిల్లా వ్యాప్తంగా తొమ్మిది లక్షల 50 ఎకరాలలో సర్వే చేపట్టాల్సి ఉండగా మూడవ వంతు సర్వే చేయడం జరిగిందన్నారు. అలాగే 85 ఎకరాలకు సర్వే రాళ్ల పాతడం జరిగిందన్నారు. ఈ సర్వేకు సంబంధించి 415 మంది గ్రామ సర్వేలు 50 నుండి 60 మంది సీనియర్ సర్వేయర్లు, విఆర్వోలు, భూ సర్వే డీటీలు తహశీల్దార్లు సర్వే పనుల్లో నిమగ్నమై ఉన్నారన్నారు. ఏది ఏమైనా అక్టోబరు 23 నాటికి రీ సర్వే పూర్తి చేయడం జరుగుతుందని ఏడి త్రివిక్రమరావు అన్నారు. బొబ్బిలి డివిజన్లో 100 గ్రామాలలో సర్వే పూర్తయ్యిందన్నారు. ప్రస్తుతము విజయనగరం డివిజన్లో 79 గ్రామాలలో సర్వే పనులు చురుగ్గా జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ తహశీల్దార్ కే.సన్యాసి సన్యాసినాయుడు, మండల సర్వేయర్ అప్పలనాయుడు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ అడ్మిషన్లపై అధ్యాపకుల ముమ్మర ప్రచారం

### ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రేణుక

విశాలాంధ్ర - సీతానగరం: ప్రైవేటు జూనియర్ కళాశాలకు, కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా విద్యను అందించే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పిల్లలను చేర్పించాలని కోరుతూ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బొబ్బిలి రేణుక తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపిసి, సిఈసి సాధారణ కోర్సులతోపాటు ఓపి, సిఈటి, ఎంఅండ్ ఏఈ, ఎంపిహెచ్ డబ్ల్యు (మహిళలు) వృత్తి విద్యా కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. కళాశాలలో పని చేస్తున్న అధ్యాపకులు రెండు బ్యాచులుగా ఏర్పడి ప్రతీరోజూ అడ్మిషన్లు గూర్చి ప్రచారాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం లక్ష్మీపురం, చెల్లంనాయుడువలస గ్రామాలను అధ్యాపకులు తెర్లి రవికుమార్, అల్లాడ రామారావునాయుడు, నవీన్ కుమార్, అచ్చేంనా యుడులు వెళ్లగా, సీతానగరం, పెద బోగిలి, బుడ్డిపేట, అప్పయ్య పేట గ్రామాలలో అధ్యాపకులు దాసరి రామకృష్ణ, అమ్మాజీ, మయూరి, ఇందిరలు వెళ్లి ప్రవేశాలు గూర్చి ప్రచారాన్ని నిర్వహించారు. అధునాతన సౌకర్యాలు, లాబ్, ప్రహరీ, విశాల తరగతి గదులు, అత్యుత్తమ ఫలితాలు, పోటీప్రపంచానికి తగ్గ విద్యను అందించడం వంటి సౌకర్యాలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్నాయని ప్రిన్సిపాల్, అధ్యాపకులు తెలిపారు. ఇంటర్ బోర్డు అధికారులు ఉత్తర్వులు, సూచనలు, సలహాల మేరకు అడ్మిషన్లు శతశాతం చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# జ్యూట్ మిల్లులు తెరిపించాలి: సీఐటీయూ

విశాలాంధ్ర - బొబ్బిలి: మూత పడిన జ్యోతి, నవ్య జ్యూట్ మిల్లులను ఎన్.సి.ఎస్ చక్కెర పరిశ్రమను తెరిపించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు పి.శంకర రావు డిమాండ్ చేశా రు. బొబ్బిలి ప్రాంతంలో జ్యూట్ మిల్లులు మూతపడడంతో ఉపాధి కోసం వెతుకులాడుతున్నారన్నారు. 2015లో శ్రీలక్ష్మి శ్రీనివాస జ్యూట్ మిల్లు మూతపడడంతో మూడు వేల కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డారన్నారు. 2018లో దిబ్బగుడివలస వద్ద ఉన్న జ్యోతి జ్యూట్ మిల్లు మూతపడడంతో 300 కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డారన్నారు. నెల రోజుల క్రితం రామన్నదొరవలస వద్ద ఉన్న నవ్య జ్యూట్ మిల్లు మూత పడడంతో మరో మూడు వందల మంది కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. ఎన్.సి.ఎస్ చక్కెర పరిశ్రమ మూత పడడంతో మరో 500 కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. వైసీపీ అధికారంలోకి వస్తే మూత పడిన జ్యూట్ మిల్లులను తెరిపిస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్నారు. శ్రీలక్ష్మి శ్రీనివాస జ్యూట్ మిల్లు స్థలాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్మేసినట్లు నవ్య, జ్యోతి జ్యూట్ మిల్లు స్థలాలను కూడా రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్మేసేందుకు కుట్ర జరుగుతోందని విమర్శించారు.

# కుక్కల స్కాంపై విచారణకు ఆదేశం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: మున్సిపల్ పరిధిలో జరిగిన కుక్కల స్కాంపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని రీజనల్ డైరెక్టర్ జి.నాగరాజు మున్సిపల్ కమిషనర్‌ని ఆదేశించారని ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమైఖ్య రాష్ట్ర అధ్యక్షులు జీవబంధు లోగిశ రామకృష్ణ అన్నారు. మంగళవారం ఉదయం గో సంరక్షణ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ చట్ట విరుద్ధంగా నిబంధనలను తుంగలో తొక్కి నోరులేని అమాయకపు నిర్దోష మూగజీవులు అయిన కుక్కలను దుడ్డు కర్రలతో బాది, తాళ్లతో ఉరివేసి ఆపరేషన్లు పేరుతో హింసించి చంపిన మున్సిపల్ కమిషనర్ శ్రీరాముల నాయుడు, హెల్త్ ఆఫీసర్ కె.సత్యనారాయణ లపై చర్యలు తీసుకోవాలని ఉన్నత అధికారులకు పిర్యాదు చేయగా వారు స్పందించి ఈ విషయమై సమగ్ర నివేదిక అందజేయాలని ఆదేశించినట్టు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర గో సంరక్షణ సమైక్య కార్యవర్గ సభ్యులు కెవిఆర్ సత్యనారా యణ, జిల్లా కార్యదర్శి రావాడ గణపతి, టోపల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# పార్వతీపురం మున్సిపాల్టీ పాలన గాడిలో పెట్టాలి

విశాలాంధ్ర - బెలగాం : పార్వతీపురం మున్సిపాలిటీ పాలన గాడిలో పెట్టాలని జనసేన పార్టీ నాయకులు కోరారు. మంగళవారం జనసేన పార్టీ జిల్లా నాయకులు పార్వతీపురం మున్సిపాలిటీ సమస్యలను పరిష్కారం చేయాలని అధికారులను కోరేందుకు మున్సిపల్ కార్యాలయానికి రాగా, మున్సిపల్ కమిషనర్, మేనేజర్, చైర్ పర్సన్ ఎవరూ లేకపోవడంతో మాజీ మున్సిపల్ చైర్మన్ స్వర్గీయ తురుమళ్ళ రామమూర్తి విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్వతీపురం మున్సిపాలిటీ పాలన గాడి తప్పిందని ఆరోపించారు. వర్షా కాలమే కాకుండా, వేసవి కాలంలో కూడా కుళాయిల్లో బురద నీరు సరఫరా చేసి ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుతున్నారని అన్నారు. నాలుగో వార్డులోని వివేకానంద కాలనీలో ఉజ్జిడి తల్లి, దేశమ్మ తల్లి వీధుల్లో మురుగు కాలువల్లో గత కొంతకాలంగా మురుగు తీత పనులు చేపట్టకపోవడంతో దోమలు, ఈగలు, దుర్గంధంతో బాధపడుతున్నట్లు ఆ కాలనీవాసులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. అలాగే పట్టణాన్ని వేధిస్తున్న చెత్త డంపింగ్ యార్డ్ సమస్యతో పాటు ఏమాత్రం వర్షం పడిన మెయిన్ రోడ్ లో కాలువలు సక్రమంగా లేక నిల్వ ఉండే నీరు ప్రవహించేందుకు కాలువలు ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. రాయగడ రోడ్డులో తాగునీటి పైపుకు లీకులు ఏర్పడి పెద్ద గొయ్యి ఏర్పడిందని, దానిని పూడ్చాలని పలుమార్లు స్థానికులు కోరినా మున్సిపల్ అధికారులు స్పందించలేదన్నారు. అలాగే మున్సిపాలిటీలోని కొంతమంది అధికారులు రుబాబు చేలాయిస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ప్రజలు తమ వద్ద ఆవేదన వ్యక్తం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు వంగల దాలినాయుడు, రాజాన రాంబాబు, మండల శరత్ కుమార్, అన్నాబత్తుల దుర్గాప్రసాద్, తెర్లి సంతు, వై. నవీన్, టి. వంశీ, రౌతు బాలాజీనాయుడు పలువురు జనసైనికులు పాల్గొని సమస్యలు పరిష్కరించాలని కోరారు.

## ప్రకృతి వ్యవసాయ ఖరీఫ్ ప్రణాళికపై అవగాహన

విశాలాంధ్ర - పార్వతీపురం: మన్యం జిల్లా ప్రకృతి వ్యవసాయ ఖరీఫ్ ప్రణాళికపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రబంధకులు పి.షణ్ముఖరాజు మాట్లాడుతూ ఈ ఖరీఫ్ ప్రణాళికపై ర్యాలీలు, దండోరా, మహిళా సంఘాల ద్వారా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అదేవిధంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తనకు ఉన్న విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించిన రైతుల వివరాలు, స్వయం సహాయక సంఘాల వారీగా, పంటల వారీగా సర్వే చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి తిరుపతిరావు, జిల్లా సహాయ ప్రబంధకులు ఎన్.ధనంజయరావు, జిల్లా కో ఆర్డినేటర్ దేవిప్రసాద్, మాస్టర్ ట్రైనీలు, డివిజన్ ఇన్‌చార్జిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతీయ ఉపకార వేతనాలకు దివ్యాంగుల ఎంపిక

విశాలాంధ్ర - తెర్లాం: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాడంగిలో 9,10 తరగతులు చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికయ్యారని హెచ్ఎం త్రినాథరావు తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ మా పాఠశాలలో అందరి పిల్లలతో పాటు దివ్యాంగ విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్నామని తెలిపారు. ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న 6గురు దివ్యాంగులకు వారి అకడమిక్ మెరిట్ ప్రకారం జాతీయ ఉపకార వేతనానికి ఎంపికయ్యారని అన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగ విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అన్నార్తుల ఆకలి తీరుస్తున్న ఫుడ్ బ్యాంకులు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: నగరంలో అన్నార్తుల ఆకలి బాధలను తీర్చుతున్న ఫుడ్ బ్యాంకులు ఏర్పాటు కావడం ముదావహమని డీసీసీబీ సీఈఓ కెంబూరి జనార్దన్‌రావు అన్నారు. మంగళవారం కోట వద్దనున్న ఫుడ్ బ్యాంకుకు చేరుకొని పేదలకు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో పేదల కోసం ఐదు ఫుడ్ బ్యాంకులు ఏర్పాటు కావడం అభినందనీయమన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సలహాలు, సూచనలతో నిరాటంకంగా ఫుడ్ బ్యాంకులు నిర్వహణ కావడం గొప్ప విషయం అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఎవర్న కుమారస్వామి, హెూటల్ శ్రీ చంద్రాస్ యజమాని చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - శృంగవరపుకోట: ఎస్.కోట మండలంలోని తెన్ను బొడ్డవర గ్రామం వద్ద గల 132/33 కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో ఉన్న 10/16 ఎంవీఏ పవర్ ట్రాన్స్ఫార్మర్ యొక్క ఆయిల్ ఫిల్టరేషన్ పనులు నిమిత్తం ఈనెల 19వ తేదీ నుండి వచ్చేనెల 4వ తేదీ వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయ బడుతుందని విజయనగరం ఆపరేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాగిరెడ్డి కృష్ణమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బొడ్డవరలోని 132/33కేవీ విద్యుత్ ఉప కేంద్రం, లోడులు కొత్తవలసలోని జిందాల్ వద్ద గల 132/33కేవీ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో ఉన్న 33కేవీ మల్లివీడు ఫీడరుకు బదిలీ చేయడం జరుగుతుందన్నారు. దాంతో మల్లివీడు ఫీడరుకు అధిక లోడు పడనున్న కారణంగా అప్పుడప్పుడు విద్యుత్ అంతరాయం ఏర్పడే అవకాశం ఉంటుందని, పై విషయాన్ని ఎస్.కోట, జామి, ఎల్.కోట మండలాల్లో గల విద్యుత్ వినియోగదారులు గమనించి సంస్థకు సహకరించాలని ఈఈ కృష్ణమూర్తి ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

## పంచాయతీ అభివృద్ధి పనులకై ఆమోదం

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని నీలకంఠ రాజపురం పంచాయతీలో పంచాయతీ అభివృద్ధి పనులకు ఆమోదించి పనులు చేపట్టేందుకు పంచాయతీ బాడీ సభ్యులు తీర్మానాలు చేయడం జరిగిందని డీసీసీబీ చైర్మన్ వివి చిన రామునాయుడు అన్నారు. గ్రామ సర్పంచ్ గొటివాడ దేవి అధ్యక్షతన నిర్వహించిన ఈ గ్రామ సభలో ఏఎంసీ చైర్మన్ మూకల కస్తూరి పాల్గొని వారిరువురు మాట్లాడారు. ప్రస్తుతం వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా పంచాయతీ పాలకులు అధికారులు తగు చర్యలు చేపట్టాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సచివాలయానికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేశారని వాటిని నీలకంఠరాజపురం పంచాయతీకి రూ.13 లక్షలు అలాగే చిన గుడిపాల పంచాయతీకి రూ. 7 లక్షలు కేటాయించడం జరిగిందని వాటి వినియోగానికై వెంటనే పనులు గుర్తించి ఉపయోగించుకోవాలని సూచించారు. అలాగే 15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలో రూ.6 లక్షలు నిధులు ఉన్నాయని వాటిలో చెత్త సంపద కేంద్రానికి రూ.3 లక్షలు కేటాయించడం జరిగిందని మిగిలిన రూ.3 లక్షలను గ్రామానికి చెందిన రామకోవేల దగ్గర రూ.1.50 లక్షలతో బోరుబావి మోటారుకి కేటాయించగా మరో రూ.1.50 లక్షలు వంటాకు వాని కల్లాల్లో బోరు బాబుకి నాలుగు పైపులైన్లు వేసేందుకు పంచాయతీ బాడీ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేసి ఆమోదించారు. ఈ గ్రామసభలో కోపరేటివ్ అధ్యక్షులు వేచలపు రామ్మూర్తినాయుడు ఉప సర్పంచ్ కండివల్లి పెద నాయుడు, వార్డు సభ్యులు పంచాయతీ కార్యదర్శిలు అప్పలనాయుడు అప్పారావు శ్వేత వీఆర్వో అప్పల రామ్ తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజల కోసం టీడీపీ కృషి

విశాలాంధ్ర - రేగిడి: పేద ప్రజల కోసం అన్న నందమూరి తారక రామారావు టీడీపీని స్థాపించారని, ఆయన ఆశయాలకు అనుగుణంగా నారా చంద్రబాబునాయుడు హయాంలో అన్ని వర్గాల పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు టీడీపీ ప్రవేశపెట్టిందని మాజీ స్పీకర్, జాతీయ పొలిట్ బ్యూరో సభ్యురాలు కావలి ప్రతిభా భారతి అన్నారు. రేగిడి మండలంలోని ఉణుకూరు, అప్పాపురం, గ్రామాల టిడిపి పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆమె సమావేశమై మాట్లాడారు. రాష్ట్రంలో పేద ప్రజలు పడుతున్న కష్ట నష్టాలను తెలుసుకుని వారిని ఆదుకునేందుకు నారా లోకేష్ బాబు యువకులం పేరుతో పాదయాత్ర చేపడుతున్నారని, లోకేష్ బాబు పాదయాత్ర వైసీపీలో వణుకు మొదలైంది అన్నారు. టిడిపి హయంలోని దళితుల విద్యార్థులు కోసం విదేశీ విద్యను ప్రవేశపెట్టిందన్నారు. చంద్రబాబు హయాంలోని దళితులకు సముచిత స్థానం ఉండేదన్నారు. ఈ కార్యక్రమంలో రాజాం నియోజకవర్గం రేగిడి, వంగర, సంతకవిటి, రాజం మండలాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఏఐహెచ్ఆర్ఏ జిల్లా అధ్యక్షునిగా గౌరినాయుడు

విశాలాంధ్ర - జామి: అఖిల భారత మానవ హక్కుల సంఘం విజయనగరం జిల్లా అధ్యక్షులుగా కొత్తలి గౌరినాయుడును జాతీయ సంఘం మరోసారి నియమించింది. దేశ రాజధాని ఢిల్లీ కేంద్రంలో ఉన్న అఖిల భారత మానవ హక్కుల సంఘం కార్యాలయంలో సంఘం పునర్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎంయు దవే నేతృత్వంలో నేషనల్ సెక్రటరీ మహమ్మద్ ఖలీద్ పాషా ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులుగా గౌరి నాయుడును మంగళవారం పునర్ నియామకాన్ని చేపట్టారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గల పలు జిల్లాలకు చెందిన దళిత సంఘ మహిళా అధ్యక్షులు దళిత సంఘ నాయకులుతో పాటుగా విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం తదితర జిల్లాలకు చెందిన ప్రజా సంఘ నాయకులు విజయనగరం జిల్లా జామి మండలంలోని తాండ్రంగి గ్రామంలో గల ఆయన కార్యాలయంలో పెద్ద ఎత్తున గౌరి నాయుడుకు అభినందనలు తెలుపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై అపారమైన నమ్మకం ఉంచి తనను అఖిల భారత మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులుగా కొనసాగిస్తూ, నియామకాన్ని చేపట్టిన ఏఐహెచ్ఆర్ఏ పునర్ వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షులు ఎంయు దవేకు, నేషనల్ సెక్రెటరీ మహమ్మద్ ఖలీద్ పాషాకు తన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## కవిటిభద్రలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి

విశాలాంధ్ర - పార్వతీపురం: మండలంలోని కవిటి పల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం ఇదేం ఖర్మ - మన రాష్ట్రానికి కార్యక్రమంను టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ జగదీశ్, టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జి బొబ్బిలి చిరంజీవులు ఆధ్వర్యంలో నిర్వ హించారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్లి గతమూడున్నర ఏళ్లలో వైఎస్సార్సీపీ అన్నివిధాలుగా వైఫల్యం చెందిందని తెలిపారు. నిరుద్యోగం, ఆడబిడ్డలకు భద్రత ఏది, బాదుడే బాదుడు, మద్యాంధ్ర ప్రదేశ్, ఊసేలేని అభివృద్ధి, కానరానిరోడ్లు, ఇసుక ఇక్కట్లు, ఏపీ రాజదాని ఏది?, అనకొండలా అవినీతి, షాక్ కొట్టించే కరెంటుధరలు, గిట్టని గిట్టుబాటు ధరలు తదితర అం శాలపై ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం పట్టణ, మండల అధ్యక్షులు గుంట్రెడ్డి రవికుమార్, దొగ్గ మోహనరావు,పార్టీ నాయకులు గొట్టాపు వెంక టనాయుడు, రెడ్డిశ్రీనివాసరావు, గర్భాపు ఉదయభాను కోలాబాబు, బోను దేవీచంద్ర మౌళి, నారాయణరావు, కెంగువ సుధీర్, బంకపల్లి రవికుమార్, కోలా వెంకటరావు, సిరిపురపు భాస్క రరావు, బుడితిశ్రీరాములు, తాన్న ప్రసాద్, గొంగాడ రామమూర్తి, మరిశర్ల కార్తీక్ నాయుడు, శంబంగి తిరుపతిరావు, బేత లక్ష్మణరావు, మరియదాస్, జాగాన రవిశంకర్,తదితరులు పాల్గొన్నారు

## సర్వే రాళ్లు ఏర్పాటు

విశాలాంధ్ర - తెర్లాం: మండలంలోని గొలుగువలస రెవెన్యూ గ్రామ పరిధిలో జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష పథకంలో భాగంగా వివిధ పొలాల సరిహద్దుల్లో, ప్రభుత్వ భూమి సరిహద్దుల్లో సర్వే రాళ్లను తహశీల్దార్ డి.రాజేశ్వరరావు దగ్గరుండి పాతించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వీఆర్ఓ రాము, గ్రామ సర్వేయర్ గాయత్రి పాల్గొన్నారు.

## మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర - శృంగవరపుకోట: ఎస్.కోట మండలం ముషిడివల్లి గ్రామ జంక్షన్ వద్ద గ్రామ సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజలు, ప్రజా ప్రతినిధులచే ఏర్పాటు చేయబడి.. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు చేతుల మీదుగా ప్రారంభింపబడిన ఉచిత మజ్జిగ పంపిణీ చలివేంద్రాన్ని వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాజు మంగళ వారం సందర్శించి ప్రజలకు, బస్సు ప్రయాణీకులకు, పాదచారులకు చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సొలు బొంగు దారప్ప, మాజీ సర్పంచులు సత్యారావు, సన్యాసిరావు, సొలు బొంగు కనకం, నాయకుడు బుదరయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రామకృష్ణారావు మృతికి సంతాపం

విశాలాంధ్ర - పార్వతీపురం: ఆకాశవాణి, దూరదర్శన్ విశాఖపట్నం, హైదరాబాద్, ఢిల్లీ కేంద్రాల డైరెక్టరుగా పని చేసిన అధికారి, జర్నలిస్ట్ రామకృష్ణారావు మృతి పట్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడెమీ మాజీ చైర్మన్ అదపాక సత్యారావు సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం విశాఖపట్నంలో రామకృష్ణారావు స్వర్గస్తులయ్యారన్న వార్త తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని అన్నారు. ఎక్కువకాలం ఆకాశవాణి, దూరదర్శన్ వార్తావిభాగం ఇంచార్జ్‌గా పనిచేసి, జర్నలిస్టులతో సత్సంబంధాలు నెరపేవారని, ఎంతో ఆత్మీయత కనబరిచేవారని అన్నారు. రామకృష్ణారావు ఆత్మకు శాంతి కలగాలని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని సత్యారావు తెలిపారు.

## పీఓను కలిసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - సీతంపేట: సీతంపేట ఐటీడీఏ పీఓగా నూతనంగా విధుల్లో చేరిన కల్పనా కుమారిని పాలకొండ ని యోజక వర్గం ఎమ్మెల్యే కళావతి పుష్ప గుచ్ఛంతో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఐటీడీఏ పరిధిలో ఉన్న గిరిజన గ్రామాలు అభివృద్ధి, మౌలిక సదుపాయాలు కల్పనపై దృష్టి సారించి అభివృద్ధి చేయాలని తెలిపారు.

## ఓటర్ల జాబితాలో తప్పులను సరిదిద్దండి

విశాలాంధ్ర - సీతంపేట: ఓటర్ల జాబితాలో తప్పులను సరిదిద్దాలని ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి అన్నారు. సీతంపేట ఐటీడీఏ పీవో సమావేశం మందిరంలో మంగళవారం పాలకొండ నియోజకవర్గం పరిధిలో గల నాలుగు మండలాలకు చెందిన తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఫారం 6 బి దరఖాస్తులను త్వరగా స్వీకరించాలని, తహశీల్దార్ లాగిన్‌లో పెండింగ్లో ఉన్నటువంటి సమాచారాన్ని పరిష్కరించాలని, 18 సంవత్సరాలు నిండినటువంటి యువతీ, యువకులను ఓటు హక్కు పొందే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నరసింహామూర్తి, ఏపీవో రోసి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జీపీఎస్ పాఠశాలను పీఓ పరిశీలన

విశాలాంధ్ర - సీతంపేట: సీతంపేట మండలం పెదరామ పంచాయతీ మోగదార గూడ గ్రామంలో జీపీఎస్ ప్రభుత్వ పాఠశాలను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనకుమారి పరిశీలించారు. పాఠశాలలో ఉపాధ్యాయుడు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో విద్యపై కాసేపు ముచ్చటించారు. అనంతరం గ్రామస్తులు గ్రామంలో త్రాగునీరు సమస్య, గృహ నిర్మాణ బిల్లులు అందటం లేదని పివో దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించగా అక్కడ చదువుతున్న విద్యార్థులకు వండిన మెనూకు వ్యత్యాసం ఉండడంతో అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడి కేంద్రాన్ని సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. నంతరం మోగదార నుండి రుక్మిణి గూడ, రామన్నగూడ వరకు పూర్తి స్థాయిలో సిమెంట్ రహదారి సౌకర్యం కల్పించాలని పీఓ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సమస్యలన్నింటిని త్వరగా పరిష్కరిస్తామని పిఓ హామీ ఇచ్చారు.

## వలంటీర్లకు నియామక పత్రాలు

విశాలాంధ్ర - గంట్యాడ: మండల కేంద్రమైన గంట్యాడ ఎంపీడీవో కార్యాలయంలో వసంత వసాది గ్రామాలకు చెందిన నూతనంగా ఎంపికైన వలంటీర్లకు ఎంపీపీ హైమావతి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియామక పత్రాలు అందుకున్న వాలంటీర్లు చిత్తశుద్ధితో పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు జైహింద్ కుమార్, సంబంధిత గ్రామాలకు చెందిన కార్యదర్శులు పాల్గొన్నారు.

## వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండండి

విశాలాంధ్ర - జామి: ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉండడంతో పాటు అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, వడదెబ్బకు గురికాకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జామి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డా. ఎస్.భాగ్యరేఖ సూచించారు. వడదెబ్బపై అవగాహన కార్యక్రమంలో భాగంగా జామిలోని కొత్తచెరువు వద్ద ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో ఆమె సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని, నీడలో ఉండేందుకు ఎక్కువగా ప్రయత్నించాలని తెలిపారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఓఆర్ఎస్ ప్యాకెట్ల వినియోగం, వాటి ఉపయోగంపై కూలీలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈ అనిల్ ప్రేమ కుమార్, జామి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, జామి ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 20న జాబ్ మేళా

విశాలాంధ్ర - విజయనగరం: ప్రైవేటు రంగంలోని హెచ్.డి.ఎఫ్.సి. - లైఫ్ బ్యాంకింగ్ సంస్థలో 60 ఉద్యోగాల భర్తీ కోసం ఈనెల 20న జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి డి.అరుణ తెలిపారు. ఈ జాబ్ మేళాలో హెచ్.డి.ఎఫ్.సి.-లైఫ్‌లో 10 బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్‌లు, 50 ఫైనాన్స్ కన్సల్టెంట్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. బిజినెస్ డెవలప్ మెంట్ మేనేజర్ పోస్టులకు డిగ్రీ విద్యార్హత కలిగి, అభ్యర్థుల వయస్సు 23 - 25 సంవత్సరాల మధ్య వుండాలని, సేల్స్‌లో రెండేళ్ల అనుభవం కలిగి వుండాలని పేర్కొన్నారు. స్త్రీ, పురుష అభ్యర్థులెవరైనా ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జీతం 23 నుంచి 25 వేల మధ్య వుంటుందన్నారు. ఫైనాన్స్ కన్సల్టెంట్ పోస్టులు 50 ఖాళీలు వున్నాయని, అభ్యర్థులు పదో తరగతి లేదా ఇంటర్ లేదా డిగ్రీ అర్హత కలిగి వుండాలన్నారు. అభ్యర్థుల వయస్సు 23 నుంచి 65 సంవత్సరాల మధ్య వుండాలని తెలిపారు. జీతం 15 నుంచి 40 వేల మధ్య వుంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లతో జాబ్ మేళాకు హాజరు కావాలని కోరారు.

# వైద్య సేవల్లో నిర్లక్ష్యం వద్దు: డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విశాలాంధ్ర - విజయనగరం క్రైమ్: పేద, బడుగు, బలహీన వర్గ ప్రజలు వైద్య పరంగా ఎటువంటి ఇబ్బందులూ పడకూడదన్న ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలోని ప్రతి జిల్లాకూ ప్రభుత్వ వైద్య కళాశాలను మంజూరు చేశారని ఏపీ శాసనసభ ఉప సభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి తెలిపారు. విజయనగరం జిల్లాకు ప్రభుత్వ వైద్య కళాశాల రావడం రోగులకు ఎంతగానో ఉప యోగకరమన్నారు. వైద్యసేవలను అందించడంలో సిబ్బంది నిర్లక్ష్యం వహించవద్దని స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా సర్వజన ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా సం దర్శించారు. ఐసీయూ, క్యాజువాలిటీ, ఇతర వార్డులను పరిశీలించి రోగులతో మాట్లా డారు. వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆయన పర్యటన సమ యంలో వార్డుల్లో ఏసీలు సక్రమంగా పనిచేయకపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగులు ఉక్కపోతతో ఎలా ఉండగలరని, తక్షణమే వాటిని అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న పడకలు, వైద్య కళాశాలలో తరగతుల ప్రారంభం, వైద్యుల వివరాలు, రోగులకు అందిస్తున్న సౌకర్యాలపై ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పద్మ లీల వివరించారు.

**వైద్య కళాశాలతో అధునాతన వైద్య సేవలు:**

గతంలో ఏదైనా అత్యవసర సందర్భంలో మెరుగైన వైద్యం కోసం జిల్లా ప్రజలకు విశాఖ కేజీహెచ్ దిక్కుగా ఉండేదని, వైద్య కళాశాల ఏర్పాటుతో జిల్లా ప్రజలకు అధునాతన సేవలు రోగులకు అందుతాయని కోలగట్ల తెలిపారు. ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, సీనియర్ డాక్టర్లు 24 గంటలూ అందుబాటులో ఉంటారని, ఆధునిక వైద్య పరికరాలన్నీ సమకూరుతాయని చెప్పారు. ఆసుపత్రిలో పడకల సంఖ్య పెరిగిందన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా కరోనా కేసులు అధికమవుతున్నాయని, ఎటువంటి పరిస్థితి వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని వైద్యాధికారులకు సూచించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ అప్పలనాయుడు, హెచ్ డి సి సభ్యులు డాక్టర్ వి.ఎస్.ప్రసాద్, రామేశ్వరరావు రామారావు, వైద్యాధికారులు సత్య ప్రభాకర్, గోషా గైనకాలజిస్ట్ డా. అరుణ శుభశ్రీ, కార్పొరేటర్లు పిన్నింటి కళావతి, సత్యవతి, వైద్యులు పాల్గొన్నారు.

# నవధాన్యాల సాగుతో పెరగనున్న భూసారం: డీపీఎం ఆనంద్

విశాలాంధ్ర - వేపాడ: నవధాన్యాల సాగుతో భూసారం గణనీయంగా పెరగడమే కాకుండా పంటకు కావలసిన అన్ని రకాల పోషకాలు లభిస్తాయని ప్రకృతి వ్యవసాయం డీపీఎం ఎం.ఆనంద్ అన్నారు. మండల కేంద్రం వేపాడలోని వైఎస్సార్ క్రాంతిపథం సమావేశం హాలులో మంగళవారం నవధాన్యాల సాగు -నేలతల్లి బాగుపై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. దశాబ్దాల తరబడి రసాయనికి ఎరువుల వాడకం వల్ల పోషక విలువలు కోల్పోయిన నేలతల్లి పరిరక్షణ కోసం ప్రకృతి వ్యవసాయం తప్పనిసరన్నారు. ప్రకృతి వ్యవసాయంతో రసాయనిక ఎరువులు ఖర్చు తగ్గిపోతుందన్నారు. జిల్లాలో అత్యధికంగా వేపాడ మండలంలోనే ప్రకృతి వ్యవసాయం అధికంగా సాగుతోందని మండలంలోని 29 గ్రామ పంచాయతీలలో 27 పంచాయతీలలో ప్రకృతి వ్యవసాయం సాగు జరుగుతోందన్నారు. మండలంలోని జాకేరు, నల్లబిల్లి గ్రామాల్లో కూడా త్వరలో ప్రకృతి వ్యవసాయ గ్రామాలుగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు, కొత్తవలస మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ మూకలి కస్తూరి,జడ్పీటీసీ ఎస్ అప్పారావు, ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ ఈర్లె సన్యాసినాయుడు, పిఏసిఎస్ అధ్యక్షులు వేచలపు రామ్మూర్తినాయుడు, జేసియస్ కన్వీనర్ బోజంకి శ్రీనులతోపాటు పలు గ్రామాల సర్పంచులు, రైతులు పాల్గొన్నారు. అనంతరం పలుగ్రామాల రైతులకు నవధాన్యాల కిట్లును పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో ఇంకా పలుగ్రామాల రైతు భరోసా కేంద్రాల నుంచి వీఏఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌లో శాస్త్రీయమైన పాఠ్యాంశాల తొలగింపు తగదు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: దేశంలో కేంద్ర ప్రభుత్వం విద్యలో కాషాయీకరణ తీసుకురావడం లక్ష్యంగా, విద్యార్థులు చదువుకునే సిలబస్‌లో పాఠ్యాంశాలను తొలగించడానికి ఖండిస్తూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కోట జంక్షన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ వెంకటేష్, పూడి రామ్మోహన్లు మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి విద్యపై దాడి చేస్తూనే ఉందని, దానిలో భాగంగానే విద్యలో కాషాయీకరణ, కేంద్రీకరణ, కార్పొరేటీకరణ విధానాన్ని అవలంబిస్తుందని విమర్శించారు. నేడు ఎన్ సి ఈ ఆర్ టి సిలబస్ లో చరిత్ర పాఠ్యాంశాలను శాస్త్ర సంబంధమైన అంశాలను తొలగించడం ఎంతవరకు సమంజసం అని విమర్శించారు. సైన్స్ పాఠ్యాంశాలలో పునరుత్పత్తి పాఠ్యాంశాన్ని తొలగించడం విద్యార్థులలో మానవుడు ఎలా పుట్టాడో తెలియకుండా చేయడం అనేది పూర్తిగా విద్యార్థులను తిరోగమనం వైపు తీసుకెళ్లడమే అని విమర్శించారు. ఇప్పటికైనా తొలగించిన పాఠ్యాంశాలను తిరిగి పునరుద్ధరించి, విద్యార్థుల శాస్త్ర సాంకేతిక మేధో తేజస్సుని పెంపొందింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాము, సోమేష్ , జగదీష్ ,సౌమ్య , సంధ్య , లావణ్య ,రమేష్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

# జాయింట్ కలెక్టర్ ఆనంద్‌కు ఘనంగా వీడ్కోలు

విశాలాంధ్ర - పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో ఏడాది పాటు దిగ్విజయంగా సేవలు అందించిన జాయింట్ కలెక్టర్ ఆనంద్ మంచి సేవా స్ఫూర్తి కలిగిన వ్యక్తని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. బదిలీపై వెళుతున్న జాయింట్ కలెక్టర్ ఓ.ఆనంద్‌కు మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారులు, రెవెన్యూశాఖ అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. జాయింట్ కలెక్టర్‌గా ఉండి జిల్లాలో కీలకమైన స్థానాన్ని దక్కించుకున్నారని చెప్పారు. జిల్లాలో భూసేకరణ, రీసర్వే, ధాన్యం సేకరణలో మంచి పనితీరు కనబరిచారని తెలిపారు. జనవరి 20 నాటికి లక్ష్యం మేరకు ధాన్యం కొనుగోలు పూర్తిచేశారని, చెల్లింపులు కూడా పూర్తిఅయ్యాయన్నారు. మంచి ప్రణాళికతో, సరైనతీరులో పనులు చేసారని చెప్పారు. జిల్లా

ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆయన సేవలను కొనియాడారు. పార్వతీపురం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్ మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్ ఆనంద్ మంచి దృక్పథం కలిగిన వ్యక్తన్నారు. జిల్లారెవిన్యూ అధికారి జె. వెంకటరావు మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధి పనులకు భూసేకరణ, అప్పగింత పనులను త్వరితగతిన చేపట్టారన్నారు. బదిలీపై వెళ్తున్న సన్మాన గ్రహీత, జాయింట్ కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ పార్వతీపురంలో పనిచేయడం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. జిల్లాలో పనిచేయడం గొప్పఅనుభూతిని ఇచ్చిందన్నారు. రెవిన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డా.ఎం.వి.ఆర్.కృష్ణాజి, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి.నాయక్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్, రెవిన్యూ సంఘం సభ్యులు సూర్యనారాయణ, శ్రీరామమూర్తి, తహశీల్దార్ శివన్నారాయణ, గ్రామరెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు నాయుడులు జాయింట్ కలెక్టర్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి.జగన్నాథరావు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారి డి.మంజులవీణ, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ప్రభాకర రావు, గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.రఘురాం, జిల్లా విద్యా శాఖ అధికారి డా.ఎస్.డి.వి.రమణ,జిల్లా సరఫరా అధికారి కె.వి.ఎల్.ఎన్ మూర్తి, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కె.విజయ గౌరి, జిల్లా గ్రామపంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా రవాణా అధికారి సి. మల్లిఖార్జునరెడ్డి, జిల్లా ప్రజా రవాణా అధికారి టి.వి.ఎస్.సుధాకర్, క్రీడల చీఫ్ కోచ్ ఎస్. వేంకటేశ్వర రావు, జిల్లా పరిశ్రమల అధికారి పి. సీతారాం, ఆర్.బి.ఎస్.కె ప్రాజెక్టు అధికారి డా. ధవళ భాస్కరరావు పాల్గొన్నారు.

## ఆదాని అక్రమాలపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ఆదాని అక్రమాలపై జాయింట్ పార్లమెంటరీ కమిటీని వేయాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. జై భారత్ సత్యాగ్రహ దీక్ష కార్యక్రమాన్ని విజయనగరం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కలెక్టరేట్ వద్ద డిసిసి అధ్యక్షులు రమేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీపై మోడీ ప్రభుత్వం తప్పుడు పరువు నష్టం కేసు బనాయించి రెండు సంవత్సరాల శిక్ష వేయించినందుకు దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున కర్గే ఆదేశాలు మేరకు, పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు సూచనలు మేరకు నిర్వహిస్తున్నామన్నారు. రాహుల్ గాంధీ పై పార్లమెంట్ సభ్యత్వం పై అనాహారతి వేటు వ్యతిరేకిస్తున్నామన్నారు. రాహుల్ గాంధీకి దేశవ్యాప్తంగా వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కక్షపూరిత సాధింపు చర్యలకు దిగిందని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు సుంకర సతీష్ రాష్ట్ర ట్రైనింగ్ సెల్ చైర్మన్ డోల శ్రీనివాస్, జమ్ము ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు

## ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లతో సమీక్ష

విశాలాంధ్ర - తెర్లాం: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లతో సమీక్షను ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త పనులను గుర్తించడం, పనుల నిర్వహణ మరియు కొలతలు, క్షేత్రస్థాయి పర్యటనలు, సగటు వేతనం, వేతన, పనుల యొక్క చెల్లింపులు, తదితర అంశములపై సమీక్షను నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతీ టెక్నికల్ అసిస్టెంట్ పనులు జరుగుతున్న ప్రాంతాలను పరిశీలన చేసి వేతనదారుల యొక్క హాజరును, అప్పగించిన కొలతలు పూర్తి చేస్తున్నారా? లేదా? పరిశీలన చెయ్యాలని అన్నారు.

## అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - శృంగవరపుకోట: గ్యాస్ లీకేజీ అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని ఫైర్ అధికారి షేక్ మదీనా కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ జాతీయ అగ్రిమాపక వారోత్సవాలులో భాగంగా శృంగవరపుకోట అగ్నిమాపక కేంద్రం పరిధిలో అగ్రిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం శృంగవరపుకోట భారత గ్యాస్ ఏజెన్సీలో పనిచేసే సిబ్బందికి గ్యాస్ ప్రమాదాలు, గ్యాస్ లీకేజీ సంభవించునపుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, నివారణ పద్ధతులు గురించి అగ్నిమాపక అధికారి అవగాహన కల్పించారు. అలాగే ఫైర్ డ్రిల్స్, రిస్క్యు మెథడ్స్‌పై సిబ్బంది పలు సూచనలు చేశారు.

## అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర - బొబ్బిలి: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు.సంక్షేమం,అభివృద్ధి తన రెండు కళ్ళుగా భావిస్తూ కుల,మత,పార్టీలు బేధంలేకుండా పారదర్శకంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కి ప్రజలంతా అండగా ఉండాలని కోరారు.మంగళవారం సాయంత్రం బొబ్బిలి పురపాలక సంఘం 06వ సచివాలయం పరిధిలో గల 12వవార్డులో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన వార్డులో ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారి మూడేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలను లబ్ధిదారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు,మండల పార్టీ అధ్యకులు శంబంగి వేణుగోపాలనాయుడు,బుడా ప్రతినిధి ఇంటి గోపాలరావు,మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## తన భూమిని తేల్చి న్యాయం చేయండి

విశాలాంధ్ర - వంగర: తనకున్నటువంటి భూమి సర్వే నంబర్ 37-4 లో గల 45 సెంట్లు భూమిలో పక్కనున్నటువంటి కొంతమంది రైతులు కలుపుకొని తనను ఇబ్బందులు పెడుతున్నారని ఓనే మాగ్గూరు గ్రామానికి చెందిన బొమ్మి సాయమ్మ తహశీల్దార్ ఐజాక్‌ను కోరారు. మంగళవారం ఆమె ఆయన్ని కలిసి ఫిర్యాదును అందజేసింది. తన పొలంలో చెట్లు నాటి తన పొలంలో కొంత భూమిని కలుపుకొని సర్వే రాళ్ళను తీసి వేసి ఇష్టానుసారంగా చేస్తున్నారని ఆమె ఆయన వద్ద ఆందోళన వ్యక్తం చేసింది. కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశానని, సమస్యను పరిష్కారం చేయాలని నేరుగా జిల్లా కలెక్టర్ ఆదేశించినప్పటికీ రెండు నెలలు వరకూ ఎవ్వరూ పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా తనకు న్యాయం చేయాలని కోరింది. దీనికి తహశీల్దార్ స్పందిస్తూ భూ సమస్యను పరిష్కరించటా నికి చర్యలు తీసుకోనున్నట్లు ఆమెకు హామీ ఇచ్చారు.

## 8 మద్యం సీసాలతో ఒకరి అరెస్ట్

విశాలాంధ్ర - బొబ్బిలి: స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఇన్స్పెక్టర్ ఆర్. జైభీమ్ ఆధ్వర్యంలో మంగళవారం బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలో ఇందిరమ్మ కోలనీ కి చెందిన బెల్లాన సాయిబాబా అను వ్యక్తి, మద్యం సీసాలు అమ్ముతుండగా 08 మద్యం సీసాల తో పట్టుకుని కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించినట్లు విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సీఐ మాట్లాడుతూ ఎవరైనా అక్రమంగా మద్యం సీసాలు మరియు నాటుసారా లు విక్రయిస్తే 9440902372 కు సమాచారం అందించాలని కోరారు. ఈ దాడుల్లో ఎస్.ఐ. చిన్నం నాయుడు సిబ్బంది చంద్ర ప్రసాద్, జయరామ్, ఆదినారాయణలు పాల్గొన్నారు.

## సీఎం జగన్‌ను కలిసిన జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర - విజయనగరం: రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డిని మంగళవారం తాడేపల్లిలోని సి.ఎం. క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి.ఎస్ మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా కలెక్టర్ గా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన నాగలక్ష్మి త్వరలో జరగనున్న భోగాపురం అంతర్జాతీయ గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం శంకుస్థాపనకు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో చేయనున్న ఏర్పాట్ల గురించి ముఖ్యమంత్రికి వివరించారు.

## 20న జడ్పీ చైర్మన్ రాక

విశాలాంధ్ర - వేపాడ: ఈనెల 20న గురువారం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) మండలానికి వస్తున్నారని మండల పార్టీ అధ్యక్షుడు ఎం జగబాబు తెలిపారు. మండలంలోని వీలుపర్తి వల్లంపూడి గ్రామాలలో గురువారం మధ్యహ్నం 3.లకు మా నమ్మకం నువ్వే జగనన్న అనే కార్యక్రమం నిర్వహించడం జరుగు తుందని ఆ కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్మన్ అలాగే జిల్లా పార్టీ అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావులు పాల్గొంటారని తెలిపారు.

## చినబోగిలి మాజీ సర్పంచ్‌కు పరామర్శ

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని చినబోగిలి గ్రామ మాజీ సర్పంచ్ సబ్బాన శకుంతలమ్మ మర ణించిన సంగతి తెలుసుకొని బలిజిపేట మండల టీడీపీ నాయకులు మంగళవారం పరామర్శ చేశారు. బలిజిపేట మండల టీడీపీ ప్రెసిడెంట్ పెంకి వేణుగోపాలనాయుడు, వాడాడ రాము, పెదభోగిలి మాజీ సర్పంచ్ బుడితి శ్రీను, పెంకి రామ్మోహన్, పెంకి కీర్తిబాబు తదితరులు విచ్చేసి సబ్బాన జగన్నాథంను పరామర్శించారు.

## చలివేంద్రం ఏర్పాటు

విశాలాంధ్ర - సీతానగరం: జిల్లా గ్రామ పంచాయతీ అధికారి సత్యనారా యణ అదేశాల మేరకు అన్ని గ్రామ పంచాయతీలో వేసవి ఎద్దడి దృష్ట్యా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరామని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, ఈఓపీఆర్డీ కుమార్ వర్మలు చెప్పారు. వారిచ్చిన సూచనలు మేరకు మంగళవారం బగ్గందొరవలస గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ నారాయణరావు, కార్యదర్శి శ్రీనివాసరావులు తెలిపారు. అన్ని గ్రామాల్లో దాహార్తిని తీర్చేందుకు తప్పని సరిగా ఏర్పాటు చేయాలని కోరారు.

## రీ సర్వే హద్దులు పక్కాగా జరగాలి

విశాలాంధ్ర - దత్తిరాజేరు: మండల పరిధిలో గల విశ్వరాయపురం గ్రామంలో భూ రీ సర్వే కార్యక్రమాన్ని మంగళవారం జేసీ మయూర్ అశోక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎటువంటి తగాదాలు లేకుండా సమస్యలు పరిష్కరించి పక్కాగా భూ రీ సర్వే చేపట్టాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వి రమేష్, మండల సర్వేయర్, వీఆర్వోలు రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జేసీకి గిరిజన సంఘం నాయకుల వీడ్కోలు

విశాలాంధ్ర - బెలగాం : పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు ప్రాజెక్ట్ అధికారిగా ఓ.ఆనంద్ విధులు నిర్వర్తించి బదిలీ అయిన సందర్భంగా పలువురు గిరిజన సంఘాల నాయకులు వీడ్కోలు పలుకుతూ శాలువాతో జ్ఞాపికతో అందజేశారు. ఈకార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు ఆరిక చంద్రశేఖర్, పల్లా సురేష్, కొలక గౌరమ్మ, దుక్క సీతారాం పాల్గొన్నారు.

# పెండింగ్ డీఏలు, ఏరియర్స్ చెల్లించాలి

### ఏపీ జేఏసీ అమరావతి జిల్లా అధ్యక్షులు రమణ రాజు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఏలు, ఏరియర్స్ చెల్లించాలని ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ జేఏసీ అమరావతి జిల్లా అధ్యక్షులు రమణ రాజు ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు రమణ రాజు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటవ నెల జీతాలు, పెన్షన్లు చెల్లించాలని 11వ పీఆర్సీ ప్రతిపాదించిన స్కేల్స్ బయట పెట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఏల ఎరియర్స్ చెల్లించాలని, 12వ పే రివిజన్ కమిషన్ వెంటనే నియమించాలన్నారు. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రయత్నం చేయాలని లేకుంటే ఏపీ జేఏసీ అమరావతి ఆధ్వర్యంలో రానున్న కాలంలో నిరసన కార్యక్ర మాలను ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి విజయ్ కుమార్, రెవెన్యూ సంఘం అధ్యక్షులు టి.గోవింద్, కోశాధికారి పద్మనాభం, సూర్య తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

విశాలాంధ్ర - బెలగాం : ఉపాధ్యాయులతో పార్వతీపురం విద్యాశాఖాధికారి ఎస్.డి.వి రమణ తన కార్యాలయంలో కోఆర్డినేషన్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. విద్యారంగం - ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కొరకు ఉపాధ్యాయ సంఘాలతో కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహిస్తున్న ఆయనకు ముందుగా యుటిఎఫ్ యూనియన్ తరపున జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్సులు టి.రమేష్, ఎస్.మురళీ మోహన్‌రావులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో అనేక సమస్యలు మీ దృష్టికి తీసుకు వచ్చినపుడు స్పందించి అన్ని సమస్యలు పరిష్కరించారని, ఈ సందర్భంగా కూడా స్పందించి సమస్యలు పరిష్కరిస్తారని ఆశిస్తున్నామని, ఉపాధ్యాయులపై కక్ష సాధింపు, బెదిరింపులు, వివక్షతలకు పాల్పడుతున్న పార్వతీపురం ఎంఈఓపై చర్యలు తీసుకోవాలని, విచారణ త్వరిత గతంగా జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. పార్వతీపురం మండలం జమదాల (యుపి స్కూల్ ఎస్జిటి) ఉపాధ్యాయుడు జగన్నాథం మార్చి నెల జీతంలో 27, 28, 29, 30 తేదీలు నాలుగు రోజులు జీతంను నోటీసు యివ్వకుండా ఎంఈఓ కట్ చేసారని, ఈ పీరియడ్‌ను వర్కింగ్ పీరియడ్‌గా పరిగణించి ఉత్తర్వులు యివ్వాలని కోరుతున్నామని, గాంధీ పిడి, వై. శంకర్రావుల జీతం చెల్లించే విధంగా పార్వతీపురం ఎంఈఓకు ఆదేశాలు యివ్వవలిసినదిగా కోరుతున్నామన్నారు.

పార్వతీపురం మండలం ఎన్. ములగ జెడ్పీహెచ్ఎస్‌కు మాథ్స్ అసిస్టెంట్ అవసరం ఉందని గతంలో ఎన్. కిశోర్ ఎన్.ములగ ఎంపిపిఎస్ నుండి (ఎస్.జి.టి) హైస్కూలు కు డెప్యుటేషన్ వేశారని, ఈ డెప్యుటేషన్ను రద్దు చేసి జిల్లేడువలస కిశోర్ ను వేశారని, ఈ సందర్భంగా ఎన్. ములగ జెడ్పిహెచ్ఎస్ కు 3 నుండి 10 వతరగతి వరకు ఒక్క మేథ్స్ టీచరే ఉన్నారు. కావున ఎన్. కిశోర్ను జిల్లేడువలస నుండి ఎన్. ములగ జెడ్పీహెచ్ఎస్‌కు పని సర్దుబాటు పేరుతో వేయాలని కోరుతున్నామన్నారు. సాల్ట్, తరల్ ట్రైనింగ్‌కు సంబందించిన ఉపాధ్యాయులకు రావలసిన డబ్బులు రిలిజ్ అయ్యాయా? లేదా? అయితే ఏ మండలాలకు ఇచ్చారు అనేది తెలియ పరచాలని, రిలీజ్ కాక పోతే రిలీజ్ అయ్యేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. రాబోయ్ విద్యా సంవత్సరంలో పుస్తకాలు ఇండెంట్ ప్రాప్తికి సరఫరా అయ్యేటట్లు చూడాలని, అలాగే ప్రతీ పాఠశాల పాయింటు గాని స్కూల్ కాంప్లెక్స్ పాయింట్ గాని సరఫరా చేయాలని అన్నారు.

కాంపెన్సేట్ సెలవులు, ఒహెచ్ లపై గందర గోళం లేకుండా ముందుగానే స్పష్టంగా నిర్ణయం తీసుకోవాలని, ప్రతీ మూడు నెలల కొక సారి కో-ఆర్డినేషన్ మీటింగ్ పెట్టాలని, ఎంటిఎస్-98 టీచర్లు జాయిన్ అయినందున పని సర్దు బాటు పేరుతో ఎస్జిటిల డెప్యుటేషన్లను రద్దయ్యేటట్లు, వెనక్కి వచ్చేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ సమస్యలపై వారు డిఈఓ కు వినతిపత్రాన్ని అందచేశారు. కార్యక్రమంలో జిల్లా ఉప విద్యాశాఖాధికారి పి. బ్రహ్మాజీరావు, ఎడిలు వున్నారు.

# ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని మంగళవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంను మంగళవారం నిర్వహించామని మండల వైఎస్ఆర్సీపీ అధ్యక్షుడు బొంగు చిట్టిరాజు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు, ఎంపిపి బలగ శ్రీరాములునాయుడు, జెడ్పీటీసీ బాబ్జి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పోల ఈశ్వరనారాయణ, మాజీ సిడిసి చైర్మన్ నడిమింటి రామకృష్ణ, మాజీ జెడ్పీటీసీలు అంబటి కృష్ణంనాయుడు, తెంటు వెంకట అప్పలనాయుడు, మాజీ ఎంపీపీ కొట్నానరత్నాకర్, మండల వైఎస్ఆర్సీపీ నేతలు ఆర్వీ పార్థసారథి, గాజాపు శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి సూర్యనారాయణ, యు.సురేష్, బొన్నాడ శివ తదితర మండల నాయకులు తెలిపారు. ప్రతీరోజూ సాయంత్రం పూట నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి వైఎస్సార్సీపీ నాయకులు కలసికట్టుగా ఉండి కార్యక్రమాన్ని గ్రామాలలో నిర్వహిస్తున్నారు. మరిపివలసలో మండల వైఎస్ఆర్సీపీ అధ్యక్షుడు బొంగు చిట్టిరాజు, మాజీ ఎంపీపీ బొంగు వరలక్ష్మి, పెదఅంకలం గ్రామంలో ఎంపిపి బలగ రవనమ్మ సర్పంచ్ శ్రీనివాసరావు, లచ్చయ్యపేటలో జెడ్పీటీసీ బాబ్జి, సర్పంచ్ చింతాడ కృష్ణ, కాసాపేటలో తెంటు వెంకట అప్పలనాయుడు,చినభోగిలిలో సర్పంచ్ శ్రీనివాసరావు, అప్పయ్యపేటలో ఎంపీటీసి బురిడి కుసుమకుమారి సూర్యనారాయణ, పెదభోగిలిలో ఎంపిటిసి గౌరీకిరణ్ కుమార్,బక్కుపేట, తామరకండి, గెద్దలుప్పి, కోట సీతారాంపురం, గాదెలవలస, జానుమల్లు వలస, సుభద్ర సీతారాంపురం, పెదబోగిలి, అప్పయ్యపేట, బుడ్డిపేట, నిడగల్లు, ఇప్పలవలస, పాపమ్మ వలస, కొత్తవలస, అంటిపేట, బూర్జ, కృష్ణరాయపురం, పనుకుపేట, దయానిధిపురం, లక్ష్మీపురం, బల్ల కృష్ణాపురం, బగ్గందొరవలస, వెంకట పురం,గుచ్చిమి, జోగమ్మపేట తదితర గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్య క్రమంలో ఆయా గ్రామాలకు చెందినసర్పంచులు ,ఎంపీటీసీలు, కన్వీనర్లు, నాయకులు, గృహ సారథులు,వాలంటీర్లు పాల్గొన్నారు.మండలంలో 80శాతంపైగా పూర్తయినట్లు పార్టీఅధ్యక్షుడు బొంగు చిట్టిరాజు తెలిపారు. ఎమ్మెల్యే జోగారావు అదేశాలు, సూచనలు, సలహాలను పాటిస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.